నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్ గురువారం 5 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

ఫోరెన్సిక్ సైన్స్ ప్రాధాన్యత పెరిగింది

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

ఎదులాపురం, డిసెంబర్ 4 : ప్రస్తుతం వస్తున్న రకరకాల కేసుల్లో ఫోరెన్సిక్ సైన్స్ ప్రాధాన్యత పెరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు అన్నారు. బుధవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రొబ్ ల్యాబ్ ఫొరెన్సిక్ సైన్స్ డైరెక్టర్ మోహన్ యదవ్ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. దీనికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై కేసుల్లో ఫోరెన్సిక్ సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో నేరాల నిర్ధారణలో ఫోరెన్సిక్ ప్రాధానమైందన్నారు. కేసులను డిఫెన్స్ చేసే న్యాయవాదులు దేనిని కూడా గుడ్డిగా నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రహీం పాల్గొన్నారు.

నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

పెండింగ్ డబ్బులు చెల్లించాలని ఆశల ధర్నా

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించడం లేదని, వెంటనే చెల్లించాలని కోరుతూ బుధవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. డిసెంబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లెప్రసీ సర్వే చేయాలని ఆశలకు జిల్లా అధికారులు ఆదేశాలు ఇస్తున్నారన్నారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, గంగామణి, సీఐటీయూ జిల్లా నాయకులు పోశెట్టి, ఇంద్రమాల, చంద్రకళ, సుగుణ, లావణ్య, భాగ్యలక్ష్మి, విజయ, జ్యోతి, అనసూయ, పద్మ, లక్ష్మి, విజయ పాల్గొన్నారు.

తాడిహత్నూర్ పాఠశాల ఎదుట బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం పట్టింపేది

నార్నూర్, డిసెంబర్ 4 : పేదింటి విద్యార్థుల మరణాలపై పట్టింపేదని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని తాడిహత్నూర్ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలుర పాఠశాల ఎదుట బుధవారం నిరసన తెలిపారు. పాఠశాలను సందర్శించే క్రమంలో పోలీసులు అరెస్టు చేసి నార్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో 1000 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 52 మంది విద్యార్థుల ప్రాణాలను పొట్టనపెట్టుకుందని ఆరోపించారు. ఫుడ్ పాయిజన్ వల్ల 38 మంది విద్యార్థులు చనిపోతే కనీసం సమావేశం ఏర్పాటు చేయని ప్రజాపాలన ప్రభుత్వం అన్నారు. సమస్యలను తెలుసుకోవడానికి వెళ్తే అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ బుట్టి శివకుమార్, బీఆర్ఎస్వీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, జంగు పాల్గొన్నారు.

ఏసీబీ కలకలం

నిర్మల్ మార్కెటింగ్ శాఖ ఏడీ శ్రీనివాస్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

- రూ.62,500 నగదు సీజ్
- నిర్మల్ మార్కెటింగ్ ఏడీ ఇంట్లో సోదాలు

భోరజ్ చెక్‌పోస్టులో తనిఖీలు

ఆదిలాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడులు కలకలం సృష్టించాయి. బుధవారం నిర్మల్ మార్కెటింగ్ శాఖ ఏడీ శ్రీనివాస్ రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడగా.. పట్టణంలోని బ్రహ్మణవాడలో గల ఆయన ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి ఏసీబీ అధికారులు జైనథ్ మండలంలోని బోరజ్ రవాణ చెక్ పోస్టులో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా చెక్‌పోస్టులో దొరికిన రూ.62,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఒకే రోజు రెండు చోట్ల ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

పలు శాఖలపై అవినీతి ఆరోపణలు

జిల్లాలో పలు శాఖల్లో పనిచేసే అధికారులు, సిబ్బందిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆదాయం అధికంగా ఉన్న పలు శాఖల్లో వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారి నుంచి లంచాలు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రజలతోపాటు సంబంధిత శాఖ ఉద్యోగుల బిల్లులు, డిప్యూటేషన్లు, ఇతర అవసరాల కోసం లంచాలు ఇవ్వాల్సి వస్తుందని బాధితులు పేర్కొంటున్నారు. తలమడుగు మండలంలో ఓ కీలక ఉన్నత శాఖ అధికారి వాహనం డ్రైవర్ అన్నీ తానై వ్యవహరిస్తున్నాడని బాహాటంగానే చర్చ జరుగుతున్నది. కొందరు అధికారులు మధ్యవర్తులు, డ్రైవర్లు, సిబ్బందితో వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తున్నది. పలు శాఖల అధికారులు, సిబ్బందిపై ఏసీబీ దాడులు జరుగుతున్న మార్పు రావడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది లంచం అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు.

సూపర్ మార్కెట్లో రూ.5.97 లక్షలు చోరీ

- సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు

బేలలోని మార్ట్‌ను పరిశీలిస్తున్న సీఐ సాయినాథ్, ఎస్సైలు

బేల, డిసెంబర్ 4 : మండల కేంద్రంలోని శ్రీకర్ మార్ట్‌లో బుధవారం మధ్యాహ్నం 3.36 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు మార్ట్ నుంచి రూ.5.97 లక్షలను దొంగిలించారు. డబ్బులు కనిపించక పోవడంతో మార్ట్ యజమాని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఎస్సై దివ్య భారతి ఘటన స్థలానికి వచ్చి సిబ్బందిని విచారించారు. ఈ విషయమై సీఐ సాయినాథ్, సిబ్బందితో వచ్చి సీసీ కెమెరాలను పరిశీలించారు. అందులో దుండగులు డబ్బులను తీసుకుని పారిపోతున్నట్లు కనిపించడంతో మార్ట్ యజమాని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆయన వెంట జైనథ్ ఎస్సై పురుషోత్తం, ఏఎస్సైలు ఉన్నారు.

దుకాణంలో చోరీ

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 4 : నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ కాలనీలో గల లక్ష్మీ ప్రసన్న జ్యువెల్లరీ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణం మూసేసి ఇంటికి వెళ్లిన యజమాని విశ్వనాథ్ బుధవారం ఉదయం దుకాణం తెరిచేందుకు షాప్‌కు రాగా.. షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దొంగతనం జరిగిందని గ్రహించన వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న సీఐ ప్రవీణ్ కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చోరీలో 4 కిలోల వెండి, రెండు తులాల బంగారాన్ని అపహరించుకుపోయినట్లు బాధితుడు తెలిపారు. దుకాణంలో సీసీ కెమెరాల్లో నిందితుని ఆనవాళ్లు ఉంటే దొరికిపోతానని అందులోని హార్డ్ డిస్క్‌ను తీసుకెళ్లాడు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

గుడిహత్నూర్, డిసెంబర్ 4 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని ఉ మ్రి(బి) ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన నేరు గా వంట గదికి వెళ్లి వంటలను పరిశీలిస్తూ విద్యార్థులకు సరిపడా భోజనం వండుతున్నారా? రోజువారీగా బియ్యం, పప్పు, కూరగాయలు ఎన్ని కిలోలు వండుతున్నారు? వసతి సదుపాయాలపై ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది? చికెన్ కర్రీ నెలలో ఎన్ని సార్లు పెడుతున్నారు? మొదలగు వాటిపై ఆరా తీశా రు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

జిన్నింగ్ మిల్ తనిఖీ

గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ సమీపంలో ఉన్నా పత్తి జిన్నింగ్ మిల్లును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ చేస్తున్న తీరును పరిశీలించి, తప్పులు లేకుండా అన్ని కాలమ్స్ ఎంట్రీ చేయాలని సూచించారు.

ఉట్రి ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మెరుగైన విద్యనందించాలి

ఇచ్చోడ, డిసెంబర్ 4 : ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాల(బాలికలు)ను పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. వంట గది, స్టోర్ రూమ్, తాగు నీరు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టులవారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాల్లో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు.

హడలెత్తించిన అదనపు కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసా, డిసెంబర్ 4 : భైంసా పట్టణంలో బుధవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా పర్యటించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించి అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక జూనియర్ కళాశాల మార్గంలో గల హోటళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ట్రేడ్ లైసెన్సులు లేకపోవడంతో మున్సిపల్ అధికారులను నిలదీశారు. మొదటి హెచ్చరికగా వదిలేస్తున్నామని, మరోమారు ట్రేడ్ లైసెన్స్ లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త దుకాణాలకు నూతనంగా ట్రేడ్ లైసెన్సుల మంజూరుతోపాటు పాత వాటి రెన్యూవల్ కోసం ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టాలని కమిషనర్ రాజేశ్ కుమార్‌కు సూచించారు. అనంతరం కిసాన్‌గల్లీలో అక్కడి నుంచి కస్తూర్బా పాఠశాలలో తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ డీఈఈ సంతోష్, ఎంఈవో సుభాష్ తదితరులు ఉన్నారు.

రోగుల నిరీక్షణ

- వైద్యం కోసం రోగుల పడిగాపులు
- సర్కారు దవాఖానలో సిబ్బంది కొరత
- మందులు లేక ప్రైవేట్ దవాఖాన బాట

బజార్‌హత్నూర్ పీహెచ్‌సీలో సిబ్బంది లేక వైద్యం కోసం పడిగాపాలు కాస్తున్న రోగులు

బజార్‌హత్నూర్, డిసెంబర్ 4 : సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మారుమూల గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో రోగులు దవాఖానకు తరలి వస్తున్నారు. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలతో వచ్చే రోగులతో ఆసుపత్రి కిక్కిరిసిపోతున్నది. బుధవారం ఉదయం 10.35 గంటలు దాటిన వైద్య సేవలందించడానికి సిబ్బంది లేకపోవడంతో రోగులు ఇదేమి సర్కారు దవాఖాన అని ఆవేశానికి లోనయ్యారు. ఇటీవలే గ్రామంలోని పిచ్చికుక్కలు చిన్నారులను కారవడంతో అత్యవసర చికిత్స కోసం వచ్చిన రోగులను డ్యూటీలో ఉన్న సిబ్బంది క్వట్రాస్‌లో నుంచి రాకపోవడంతో గంటల తరబడి ఆసుపత్రి ఆవరణలోనే పడిగాపులు కాయాల్సిన వచ్చింది. రాత్రి వేళల్లో అయితే వైద్య సేవలు శూన్యం. ఇదే విషయంపై వైద్యాధికారి భీంరావును వివరణ కోరగా పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు మా సమస్యలను విన్నవించిన పట్టించుకోవడం లేదు. ఆసుపత్రిలో సిబ్బంది, మందుల కొరతతో మెరుగైన వైద్యా సేవలను అందించలేక పోతున్నాం. 24 గంటల వైద్య సేవలందించే దవాఖానకు కేవలం ఒక వైద్యాధికారి ఉండడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

సిబ్బంది లేక బెడ్‌పైనే పండుకున్న రోగి

ఖాళీగా ఉన్న ఫార్మసిస్టు రూం

జ్వరంతో యువతి మృతి

వేట్టి శ్రీదేవి(ఫైల్)

ఇంద్రవెల్లి, డిసెంబర్ 4 : పిట్టబొంగురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓల్‌మద్రి గ్రామానికి చెందిన యువతి వేట్టి శ్రీదేవి(19) జ్వరంతో బుధవారం మృతి చెందింది. కుటుంబీకులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఓల్‌మద్రి గ్రామానికి చెందిన వేట్టి జాకు, భారతిబాయి దంపతుల కూతురు శ్రీదేవి మూడు నెలల నుంచి తిర్యాని మండలంలోని తమ బంధువుల వద్ద ఉంటుంది. పక్షం రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో బంధువులు పలు దవాఖానల్లో వైద్యం అందించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో రెండు రోజుల క్రితం ఓల్‌మద్రి గ్రామానికి తీసుకొచ్చి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో వైద్యం అందించిన ఆరోగ్యం కుదుపుపడలేదు. ఆరోగ్య పరిస్థితి విషమించి ఇంట్లోనే మృతి చెందినట్లు తెలిపారు.

రేపు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం పబ్లిక్ హియరింగ్

ఎదులాపురం, డిసెంబర్ 4 : స్థానిక సంస్థలవారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల విషయంలో బీసీ కులాల నుంచి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి, సమర్పణలు అభ్యర్థనలు, సలహాలు ఆక్షేపణలను ఆహ్వానించేందుకు పబ్లిక్ హియరింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించాలని పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 6 తేదీన కలెక్టర్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వీకరణ ఉంటుందన్నారు. బహిరంగా విచారణకు ఉమ్మడి జిల్లాలోని బీసీ కుల సంఘాల నుంచి దరఖాస్తులను సమర్పించుటకు హాజరు కావాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ సంఘల నాయకులు, బీసీ కులస్తులు పబ్లిక్ హియరింగ్ విచ్చేసి తమ సమర్పణలను, అభ్యర్థనలు, సలహాలు, అక్షేపణలను చైర్మన్ డెడికేటెడ్ కమిషన్‌కు సమర్పించాలని కోరారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న డిప్యూటీ ఆర్ఎం ఆపరేషన్ ప్రణీత్

ప్రతి ఒక్కరిలో కుటుంబ భావన రావాలి

- విజేతలకు బహుమతుల అందజేత

ఎదులాపురం, డిసెంబర్ 4 : సంస్థలో పని చేసే ఒక్కరిలో కుటుంబం అనే భవన రావాలన్న ఉద్దేశంతో ఆస్టీసీ సంస్థ వన భోజనాల మహోత్సవాన్ని నిర్వహిస్తుందని డిప్యూటీ ఆర్ఎం ఆపరేషన్ ప్రణీత్ అన్నారు. రెండు రోజుల వనభోజనాల మహోత్సవాల్లో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించారు. బుధవారం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్ఎం ఆపరేషన్ మాట్లాడుతూ ఇక నుంచి యేటా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఉన్నతాస్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరు ఒక చోట చేసి కుటుంబ సభ్యులతో ఆడిపాడి భోజనాలు చేయడంతో ఒకే కుటుంబం అన్న భావన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శంకరయ్య, డీఎం కల్పన, వెల్ఫేర్ బోర్డు సభ్యులు ప్రమీల, ఎంఎఫ్ శ్రీకార్, రిజర్వేషన్ ఇన్‌చార్జి సయ్యద్ అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు వివరాల సేకరణ

ఇచ్చోడ, డిసెంబర్ 4 : జున్ని గ్రామానికి చెందిన రైతు దొంగ్రే జ్ఞానేశ్వర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రైతు బీమా క్లెయిమ్ కోసం మరణ వివరాలను మండల వ్యవసాయ అధికారి కైలాష్ సేకరించారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఈవో జీవన్ నాయక్, గ్రామస్తులు ఉన్నారు.